
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!







## కాంగ్రెస్‌కు కరెంట్ వాతే

## 3 గంటల కరెంట్ ఏ కొనకు సాల్తది?

## అసలు పంటలు ఎట్ల పండించాలె?

'వ్యవసాయానికి 24గంటల కరెంట్ వద్దు.. 3 గంటలు చాలు' అని కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై రైతాంగం కన్నెర్ర చేస్తున్నది. రైతులకు వ్యతిరేకంగా అడ్డగోలుగా వాగిన రేవంత్‌రెడ్డిపై మండిపడుతున్నది. స్వరాష్ట్రంలో ఇప్పుడిప్పుడే పచ్చబడుతున్న రైతుల జీవితాల్లో నిప్పులు పోయాలనే కుట్రలను ఖండిస్తున్నది. 24 గంటల కరెంట్ సరఫరాను చూసి ఓర్వలేక అవగాహన లేమి ప్రకటనలు చేస్తున్నారని దుమ్మెత్తిపోస్తున్నది. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఎట్ల సాల్తదని ప్రశ్నిస్తున్నది. ఎద్దు, ఎవుసం తెల్వకుండా ఎట్ల మాట్లాడుతరని ధ్వజమెత్తుతున్నది.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ)

### కాంగ్రెసోళ్లకు వ్యవసాయంపై అవగాహన లేదు



కాంగ్రెస్ నాయకులకు వ్యవసాయంపై అవగాహన లేదు. అందుకే రైతుల గురించి, వ్యవసాయం గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుండ్రు. వ్యవసాయానికి 3 గంటల కరెంటు సరిపోతదని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నరు. ఒకప్పుడు ఇదే కాంగ్రెస్ హయాంలో నాసిరకం కరెంటు ఇస్తే కనీసం ఎకరం పొలం పారలేదు. కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేది. ఇప్పుడు 3 గంటల కరెంటు ఇస్తే వ్యవసాయం చేయడం కష్టమే. అంతేకాదు ఇచ్చే 3 గంటల కరెంటు లోఓల్టేజీ వస్తే మోటర్లు నడువవు. ఇప్పుడు 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు మాత్రమే వాడుతున్నాం. 10 హెచ్‌పీ మోటర్లు కొనాలంటే లక్ష రూపాయలు కావాలి. అంతేకాదు 10హెచ్‌పీ మోటర్లతో భూగర్భజలాలు వట్టిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల నాణ్యమైన కరెంటుతో రైతులమంతా సంతోషంగా ఉన్నాం. కాంగ్రెస్ నిర్ణయాలను రైతులమంతా తీవ్రంగా ఖండిస్తున్నాం.

–కందాల రంగారెడ్డి, రైతు, మహబూబ్‌పేట, యాదగిరిగుట్ట

### 3 గంటల కరెంటుతో ఒక్క మడి కూడా తడవదు



స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న 24 గంటల కరెంటుతోనే రైతులకు ఎంతో మేలు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్తున్న 3 గంటల కరెంటుతో ఒక్క మడి కూడా తడవదు. ఇలా చేస్తే కర్ణాటక గతే మాకూ పడుతుంది. వ్యవసాయంపై అవగాహన ఉన్న సీఎం కేసీఆరే రైతులకు మంచి చేస్తున్నారు. గతంలో కరెంట్ ఎప్పుడు వచ్చేదో, ఎప్పుడు పోయేదో తెలియని పరిస్థితి. రాత్రంతా పొలాల్లోనే ఉండేవాళ్లం. 10 హెచ్‌పీ మోటర్ వాడితే ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడి పేలిపోయే ప్రమాదం ఉంది. రైతుల కష్టాలపై అవగాహన లేకుండా రేవంత్‌రెడ్డి మాట్లాడటం బాధాకరం. తెలంగాణ వచ్చిన తర్వాతే మేము కోలుకుంటున్నాం. ఏటా రెండు పంటలు పండించుకోగలుగుతున్నాం. కాంగ్రెస్ పార్టీ 3 గంటల కరెంటు చాలనడం కుట్ర పూరితం. ఆ కరెంట్‌తో పంటలు పండించలేం. మళ్లీ వలసలు వెళ్లాల్సి వస్తది. కాంగ్రెస్‌వి అన్నీ ఝూటా మాటలే. 10 హెచ్‌పీ మోటర్‌తో 3 గంటల్లో పొలానికి నీరు పారించుకోవచ్చని చెప్పడం అవివేకం. ఎన్ని గంటల్లో ఎన్ని ఎకరాలు పారుతుందని, 10 హెచ్‌పీ మోటర్లు వ్యవసాయానికి వాడుతారో లేదో కూడా తెలియని పరిస్థితి వారిది.

–మామిడాల అంజయ్య, రైతు, రాఘవాపురం, ఆలేరు రూరల్

### 3 గంటల కరెంట్‌తో కష్టాలెన్నో..!

ఉమ్మడి ఏపీలో రైతన్న కరెంట్ కష్టాలు అన్నీఇన్నీ కావు. విద్యుత్ కోతలు, ఆందోళనలు, ధర్నాలు, సబ్ స్టేషన్ల ముట్టడి, అధికారుల ముట్టడి నిత్యకృత్యమయ్యేవి. అసలు విద్యుత్ ఎప్పుడు వస్తుందో..? ఎప్పుడు పోతుందో కూడా తెలియని దుస్థితి. అటు చెరువుల్లో నీళ్లు లేక.. ఇటు బోరు బావులు నడవడానికి కరెంట్ లేక అన్నదాత అరిగోస పడ్డాడు. వ్యవసాయానికి మూడు, నాలుగు గంటలు కూడా దిక్కులేదు. అది కూడా ఎప్పుడో అర్ధరాత్రి వచ్చే పరిస్థితి. వచ్చే కరెంటు కూడా లోఓల్టేజీది కావడంతో మోటర్లు కాలిపోయేవి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేవి. వాటి మరమ్మతుల కోసం రైతులు తిరిగి ఖర్చులు పెట్టుకోవాల్సి వచ్చేది. రాత్రి వేళ కరెంట్‌తో బాయికాడ మోటర్ల కోసం వెళ్లిన ఎంతో మంది రైతులు మృత్యువాత పడ్డారు. విద్యుదాఘాతం, పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయేవారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ మళ్లీ వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలని, పాత రోజులు తెచ్చి రైతుల నోట్లో మట్టి కొట్టాలని చూస్తున్నది. మూడు గంటల కరెంట్ పగలిస్తారా..? రాత్రి ఇస్తారా అనేది కూడా స్పష్టత లేదు.

### 24 గంటల కరెంట్ వదులుకుంటమా..?

దేశంలో వ్యవసాయానికి 24గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించే ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ. ప్రధాని మోదీ రాష్ట్రంలో కూడా 24గంటల కరెంట్ లేదు. ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్లు కాలుడే లేదు. లోఓల్టేజీ సమస్యే లేదు. జనరేటర్లు, కన్వర్టర్లు లేవు. మోటర్ వైండింగ్ చేసే షాపులు కూడా దివాళా తీశాయి. నాడు పవర్ హాలీడేలు, కరెంట్ కోసం ఆందోళనలు, కాల్పులు, మరణాలు జరిగితే.. నేడు వేసవిలోనూ ఆటంకం లేకుండా రోజంతా విద్యుత్ సరఫరా జరుగుతున్నది. రోజంతా కరెంటు ఉంటుండడంతో రైతులు ఏంచక్కా తమకు ఇష్టమున్న సమయంలో మోటర్లు పెట్టుకుంటున్నారు. సాగు నీరు, కరెంట్ అందుబాటులో ఉండటంతో సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడి కూడా పెరిగింది. ఇట్లాంటి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని వదులుకుంటమా? అని రైతులు అంటున్నారు.

ఎద్దు, ఎవుసం తెల్వనిది ఎట్ల మాట్లాడ్తరు?

అన్నదాతను మళ్లీ ఆగం చేద్దామని చూస్తున్నరా?

కాంగ్రెస్‌పై భగ్గుమన్న జిల్లా రైతాంగం

సీఎం కేసీఆర్ పాలనలోనే రైతులకు మంచి రోజులు

రైతు బంధువు బీఆర్‌ఎస్‌కే మద్దతు అని వెల్లడి

### 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం సాగదు



2014 ముందు ఉన్న పరిస్థితి అందరికీ తెలిసిందే. అప్పుడు ఏ అర్ధరాత్రో, అపరాత్రో వచ్చే రెండు లేదా మూడు గంటల కరెంటుతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వచ్చీరాని కరెంటు కోసం రైతులు రాత్రిపూట పొలాల వద్దనే పండాల్సి వచ్చేది. ఈ క్రమంలో కొందరు రైతులు పాములు, తేళ్ల బారిన పడి మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెసోళ్లు మళ్లీ 3 గంటల కరెంట్ సరిపోతదని, 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అనడం ఏ మాత్రం సరి కాదు. 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం సాగు చేయలేం. ఈ మోటర్లతో బోర్లు వట్టిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ఇస్తున్న పద్ధతే బాగుంది. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ కేవలం తొమ్మిది నెలల్లోనే విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపారు. మళ్లీ పాతరోజులు వస్తే రైతుల బతుకులు ఆగమే.

–పోచయ్య, పెద్దకందుకూరు, ఆలేరు

### 3 గంటల కరెంటుతో మునుగుడే



బీఆర్‌ఎస్ పాలనలో వ్యవసాయానికి 24 గంటల కరెంటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెబుతున్న 3 గంటల కరెంటుతో పది గుంటల పొలం కూడా తడవదు. ఆయన మాటలు వింటే రైతులు మునుగుడు ఖాయం. 10 హెచ్‌పీ మోటర్లు వాడితే భూగర్భజలాలు ఇంకిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా రైతులంతా 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లు మాత్రమే వాడుతారు. 10హెచ్‌పీ ఎవరూ వాడరు. అంతేకాకుండా ఈ మోటర్లతో రైతులకు ఆర్థిక భారం. లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతాయి. లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సీఎం కేసీఆర్ పాలనలో అలాంటి ఇబ్బంది లేదు. రైతులంతా ఉదయం పూటనే మోటర్లు పెట్టుకుంటున్నారు. 24 గంటల కరెంటు ఇస్తున్న సీఎం కేసీఆర్‌కే మా మద్దతు.

–పర్కి, మల్లారెడ్డి, రైతు, జలాల్పూర్, భూదాన్‌పోచంపల్లి